
# యుగే యుగే



గంటి రమాదేవి

జైసాల్మార్‌లో బయలుదేరేసరికి బాగా పొద్దెక్కింది. స్వామినాథన్ వాళ్ళింట్లో పూరి, బంగాళా దుంపల కూర తిని, చిక్కటి కాఫీ తాగి జీపు ఎక్కాము.

జైపూర్‌లో ఖగోళశాస్త్రం చదువుతూ ఉన్నాను నేను. రాజస్థాన్ ప్రభుత్వంలో వ్యవసాయ నిపుణుల సంఘానికి అధ్యక్షుడుగా పనిచేస్తున్నాడు స్వామినాథన్. స్వామినాథన్‌ని నేను 'అంకుల్' అని పిలుస్తాను. నిజానికి స్వామినాథన్ నాకు మేనమామ వరస.


జైసాల్మార్‌నుండి దేవికోట్ వరకు మౌనంగానే గడిచింది మా ప్రయాణం. జూన్ నెల ఎండ చుర్రుమంటూంది. పూరీ,కూరా తిన్న స్వామినాథన్ మామయ్య తాపీగా ఉన్నాడు.

"ది గ్రేట్ ఇండియన్ డెసెర్ట్' చూడాలన్న నీ కోరిక తీరిందా?" అడిగాడు అంకుల్.

"ఈ ఎడారి చూస్తూ ఉంటే నాకు ఒకటనిపిస్తూ ఉంది, అంకుల్. దీన్ని పంట భూమిగా ఎందుకు మార్చకూడదు?"

స్వామినాథన్ మామయ్య నవ్వాడు. నా ప్రశ్న మరీ చిన్న పిల్లవాడి ప్రశ్నలా ఉందేమో? ఖగోళ శాస్త్రంలో డాక్టరేట్‌కు ప్రయత్నిస్తున్న నేను అడగవల సిన ప్రశ్న కాదేమో!

"ఎ స్, ఎందుకు చెయ్యకూడదు? ఇన్ ఫాక్ట్, మా పరిశోధన అంతా దానిమీదే. ఈ ఎడారి ప్రాంతాల్లో క్షారశాతం ఎక్కువగా ఉన్నట్టు కనుగొన్నాము. రాజస్థాన్ కెనాల్ ఇంకా కొంచెం పొడిగించి సుదూర ప్రాంతాలయిన సామొ, కురి, దివేరా, శివో, లూఖా, గిరోన్ ప్రాంతాలను సస్యశామలం చెయ్యాలని మా ఉద్దేశం. లక్షల టన్నుల యూరియా, సూపర్‌ఫాస్ఫేటు, అమ్మోనియం ఫాస్ఫేటు అవసరం. దండిగా నీరు కావాలి. ఫోటో సింథ సి స ప్రక్రియద్వారా తొందరగా క్లోరోఫిల్ పెంచుకుంటూ పెరిగే మొక్కలు కావాలి..."



జోధ్‌పూర్‌లో జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుకోవాలి. రాత్రి బయలుదేరుతుంది ఆ బండి. స్వామినాథన్ మామయ్యకి జోధ్‌పూర్‌లో ఏదో పని ఉందట. రాత్రి అక్కడ ఉండి మర్నాడు బయలుదేరి వెళ్ళిపోతాడు.

మధ్యాహ్నం అవుతుండగా జీపు ఆపుచేశాడు అంకుల్. ఇంజను బాగా వేడెక్కింది. రేడియేటరులో పోసుకోవడానికి నీరు తీసుకువచ్చాడు. ఇంజనులో నీళ్ళు పోసి, బాస్కెటు విప్పాడు. స్టెయిన్‌లెస్ కారియర్‌లో పెరుగన్నం, ఆవకాయ కట్టి ఇచ్చింది అత్తయ్య.

ఆకలిమీద మహా రుచిగా ఉంది పెరుగన్నం. వాటర్ బాటిల్‌లో చల్లటి నీళ్ళు తాగాము.

కనుచూపుమేర ఇసుక తప్ప మరేమీ కనపడడం లేదు. మధ్యాహ్నపుటెండ సూటిగా ఇసుకమీద పడుతూంది. దూరంగా, ఇసుక కొండల నడుమ ఎండమావులు. తటాకాల్లో గాలికి కదలే కెరటాల్లా, ఇసుకలో సూర్యకాంతి చేసే విచిత్ర నర్తనం.

స్వామినాథన్ మామయ్య జీపు స్టార్టు చేశాడు. స్టార్టు కాలేదు. బోనెట్ ఎత్తి పరీక్షించాడు. ఫలితం కనపడలేదు. చేసేదేమీ లేక నేను ఇసుక తిన్నెల వైపు చూస్తూ ఉండిపోయాను. జోధ్‌పూర్ వెళ్ళి, జైపూర్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ పట్టుకోగలనా అన్న అనుమానం మొదలయింది నాలో. ఇంకా కోరాల్, శివ్, బార్మార్ దాటాలి. ఆ తరవాతే జోధ్‌పూర్.

దూరంగా ఇసుకలో సుడిగాలి మొదలయింది. సుళ్ళు సుళ్ళుగా ఇసుక పైకి లేచి సూర్యుడిని కప్పేసింది. ఇసుక తుఫాను. టన్నుల కొద్దీ ఇసుక గాలిలో లేచి చుట్టుపక్కలంతా ముంచెత్తేస్తూంది.

స్వామినాథన్ అంకుల్ ముఖంలో భయం తొంగి చూసింది.

"మనం దూరంగా పారిపోవాలి. ఇసుకలో కూరుకుపోతే, జీపును బయటికి తియ్యడం కష్టం" అన్నాడు.

జీపు స్టార్టు చేశాడు అంకుల్. ఈ సారి స్టార్ట్ అయి నెమ్మదిగా కదిలింది మా వాహనం.

కొంత దూరం వెళ్ళిన తర్వాత 'హమ్మయ్య' అన్నాడు అంకుల్. "తుఫాను నుండి తొందరగానే బయట పడ్డాం" అన్నాడు. అని ముందుకు చూసి ఉలిక్కి పడ్డాడు అంకుల్.

అప్పుడు చూశాను నేనుకూడా.

హైవే లేదు మాముందు. ఇసుకలో నడుస్తోంది మా జీపు.

మేం దారి తప్పాం...

** ** **

రక్తపు ముద్దలా మారిపోయాడు సూర్యుడు. పెద్ద సూర్యబింబం ఇసుక తిప్పల వెనుకకు మాయ మవుతుండగా అంకుల్ అన్నాడు:

"ఇసుక తుఫాన్ వచ్చినప్పుడు మనం రోడ్డుమీదినుంచి మారి ఇంకో దిశగా వచ్చాం. ఈ చీకటిలో ప్రయాణం మంచిది కాదు. రాత్రి అవుతూంది. కాలు కింద పెట్టకు. భయంకరమైన పూసలతేళ్ళు, నల్లతేళ్ళు, పక్షులను సెతం నొక్కిపట్టి తినే మండ్రగబ్బలు ఉంటాయి. ఎడారి క్రియిట్‌లు రాత్రిపూట తిరుగుతూ ఉంటాయి. ఎట్టి పరిస్థితులలోనూ జీపు దిగవద్దు..."

క్రమంగా చీకట్లు అలుముకున్నాయి. కాక్టస్ పొదలు, రక్కిన పొదలు, ముళ్ళ తుప్పల దగ్గర అలికిడి మొదలయింది. ఆ చెట్ల మొదళ్ళలో రంధ్రాలు చేసుకుని నివసిస్తున్న జంతుజాలం చీకటి పడటంతో ఆహారాన్వేషణకు బయలుదేరాయి.

ఆకాశంలో లెక్కకు మిక్కిలి నక్షత్రాలు బలమైన, బలహీనమైన కాంతిపుంజాలను తమ శక్త్యనుసారం వెదజల్లుతున్నాయి.

ఎడారిలో వెచ్చటి గాలి చల్లబడింది.

టైమ్ పదకొండు.

వేడీ, చలీ తొందరగా వస్తాయి ఎడారిలో.

ఆకాశంలో నక్షత్రాలను చూడడం నా హాబీ. అందులో నే చదివేది ఖగోళశాస్త్రం కదా! తెరలు తెరలుగా నిద్ర వస్తున్నది, పోతున్నది. బాగా చలి వేస్తూంది.

ఆకాశంలో చూస్తున్న నా చూపు ఒక చోట కేంద్రీకృతమైంది.

తెల్లటి కాంతిలో కుజగ్రహం ప్రాంతంలో ఒక నక్షత్రం కదులుతోంది.

అది భూమివైపు వస్తూ ఉందా! నిజంగానే అలా వస్తూ ఉంది!

రేడియం డయలు వాచీలో టైమ్ చూశాను.

క్రమంగా ఆ వెలుగు దగ్గరవుతోంది.

నాలుగు నిమిషాల, నలభైఅయిదు సెకన్ల తరవాత...

అది మా ముందు దిగింది.

** ** **

కళ్ళు చూడలేనంత కాంతి. శబ్దం మాత్రం లేదు. పెద్ద ఫుట్‌బాల్ స్టేడియం అంత ఆకారంతో గుండ్రంగా ఉంది. మా జీపుకు కొంత దూరంలో ఆగిం దది. యు.ఎఫ్.వో. (అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జక్ట్సు) ఎగిరే పళ్ళాల గురించి చాలా చదివాను. అమెరికా మాజీ అధ్యక్షుడు కార్టర్ లాటి ప్రముఖులుకూడా ఈ యు.ఎఫ్.వో.లు ఉన్నాయని వ్రాశారు. నా ఎదురుగా ఉన్నది ఎగిరే పళ్ళెమని, భ్రమ కాదని నిశ్చయించుకున్నాను. స్వామినాథన్ మామయ్య జీపు లోనే జోగుతున్నాడు.

నేనూ జీపు దిగాను... బయలుదేరాను.

ఆ వింత అంతరిక్ష నౌకనుండి ఎవరో బయటకు వచ్చారు.

ఎడారి అంతా చీకటిగా ఉంది.

ఆ అంతరిక్ష నౌక దగ్గర చీకటి లేదు.

వెలుగులో ఆ నౌకలోనుండి వస్తున్న మనిషిని చూశాము.

మనిషి ఆకారంలో ఉన్నాడు!

నా లాగా! (నా పేరు రాఘవ) ఉన్నాడు.

మరొకరు మామయ్యలాగా!

ఇతర గ్రహాలలో మనుషులు(!) భూమిమీద ఉండే మనుషుల ఆకారంలో ఉంటారా!

** ** **

మనిషి రూపే కాదు, మాటకూడా మనిషిలాగే ఉంది. ఎక్కడనుంచి వచ్చారని నాలో నేను గొణుక్కుంటున్నట్లు అన్నాను. నన్ను పోలిన మనిషి నవ్వాడు. ఏదో చెప్పబోయాడు. మన తెలుగు భాష అర్థమవుతుంది కాబోలు అనుకున్నాను.

"మీ రే భాష మాట్లాడినా ఆ భాషలోనే సమాధానం ఇవ్వగలను" అన్నా డా మనిషి.

అతడి నోటినుంచి తెలుగు మాట వినబడేసరికి అదిరిపోయాము. ఎడారి తేలు హఠాత్తుగా కుట్టినట్టనిపించింది.

వెల్లువలా, ఉప్పెన కెరటంలా నాలో ఎన్నో ప్రశ్నలు... వాటన్నిటికీ సమాధానాలు కావాలి.

నా ఒక్కొక్క ప్రశ్నే అంబుల పొదిలో బాణంలా బయటికి దూసుకు వచ్చింది.

** ** **


"ఎక్కడనుంచి వస్తున్నారు?... మీరు గ్రహాంతరవాసులా?" నా ప్రశ్న అది.


"ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పేలోపల ఈ విశ్వాంతరాళం గురించి మీ కేమి తెలుసో, భూమిలో లాగా ఇతర గ్రహాలలో జీవరాసి గురించి ఏమి తెలుసో నేను తెలుసుకోవాలి. అప్పుడు మీ ప్రశ్నలకు సమాధానం చెబుతాను."

అది నా సబ్జెక్టు. నాకు కొట్టిన పిండి. వందలాది ఏళ్ళుగా మన శాస్త్రజ్ఞులు కనుక్కున్న విషయాలు నిజమో, కాదో తెలిసిపోతుంది.

నేను చెప్పడం మొదలు పెట్టాను.

"ప్రాణికి మూలాధారం కార్బన్. సిలికాన్ లేక జెర్మానియమ్ కార్బన్‌తో బాగా కలుస్తాయి" అని చెప్పి జీవకణాలు, ప్రోటీన్లు, అమినోఏసిడ్స్, ప్రోటోప్లాసమ్, న్యూక్లియస్, విద్యుచ్ఛక్తి, ఆర్.ఎ






న్.ఎ., డి. ఎన్.ఎ.. జెనెటిక్ ఇంజినీరింగ్, మనిషి శరీరంలో ముఖ్యావయవాలు మొదలైనవికూడా చెప్పాను.

తరవాత నా కిష్టమైన ఖగోళశాస్త్రం గురించి నాకు తెలిసింది స్పష్టంగా చెప్పాను.

సూర్యమండలం, పాలపుంత (గేలాక్సీ) గురించి చెప్పాను. సూర్యకిరణాలు భూమికి చేరడానికి దాదాపు ఎనిమిది నిమిషాలు పడుతుందని, కాంతివేగంతో ఏదీ ప్రయాణించలేదని చెప్పాను.

"విశ్వంలో ఎన్ని నక్షత్రాలున్నాయని మీ అంచనా?" అతను ప్రశ్నించాడు.

"చాలా... మా ఊహ ప్రకారం పది పక్కన పందొమ్మిది సున్నలు పెడితే ఎంతో అన్ని నక్షత్రాలున్నాయి..."

"వీటిలో ఎన్ని నక్షత్రాలకు సౌరకుటుంబంలో లాగా గ్రహాలున్నాయి? వాటిలో భూమి వంటి వరిస్థితులు గల గ్రహాలెన్ని?"

"50,000 నుండి 10,00,00,000 నక్షత్రాలకు అంతే సంఖ్యలో భూగ్రహాలున్నాయి. వాటిలో జీవరాసులు, మనిషి కన్న తెలివైన జాతులు ఉన్నాయి. మనకు కనిపించే పాలపుంత ఎంత పెద్దదంటే... నలభై అడుగుల వెడల్పూ, నలభై అడుగుల పొడవూ గల పెద్ద కాగితంమీద గుండు సూదితో సిరాలో అద్ది, కాగితం మీద వేస్తే ఎంత చుక్క పడుతుందో అంత సమానం!మా సూర్యమండలం లాటివి ఈ చుక్కలో 13,500 కోట్ల వరకు ఉన్నాయని అంచనా. కాంతివేగంతో పాలపుంత ఈ చివరనుండి ఆ చివరవరకు వెళ్ళడానికి అరవైవేల సంవత్సరాలు పడుతుంది. కాంతివేగంతో ప్రయాణం చెయ్యడం అసంభవం అని తేలింది..." నేను చెప్పడం ఆపి ఊపిరి తీసుకుని అన్నాను... "అందుకే ఇతర గ్రహాలనుండి వచ్చిన మనుషులను చూశానని ఎవరైనా చెబితే, వాళ్ళను పిచ్చివాళ్ళుగా చూస్తారు మాభూలోకం ప్రజలు."

అవతల మనిషిలో కించిత్ చిరాకు కనుపించింది.

"మీ రంతా మూ ర్ఖులు. మీకు సాధ్యం కాకపోతే ఇంకెవరికీ సాధ్యం కాదు అనుకోవడం తప్పు. మీ శరీరంలోలాగా అందరికీ రక్తమూ , గుండె, ఊపిరితిత్తులూ, కాలేయమూ , మూ త్రపిండాలూ ఉంటాయనుకోవడం, ప్రాణి పుట్టుకకు ప్రోటీన్సు, ఎమినో ఆసిడ్స్ కావాలనుకోవడం... ఇలా...ఎన్నో తప్పుడు ఆలోచనలు మీకున్నాయి. మీరు కనుగొన్న ప్రతి వస్తువూ, కొత్త పరికరాలూ మేం చెప్పగా చేసినవే..."

"మాశాస్త్రవేత్తలు నిరంతరం శ్రమించి సాధించినవి మీరు చెప్పడమేమిటి..."

"అవును. మీ ఆలోచనాసరళి కొన్ని పరిధులకు కట్టుబడి ఉంది. ఆ పరిధులను ఛేదించి చూపేది మేమే. మీ శాస్త్రజ్ఞులకు జ్ఞానబోధ చేసేది మేమే..."

"ఏమిటి రుజువు?"

"ఆరువందల కోట్ల ఏళ్ళ క్రితం భూమిపై జీవకోటి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అనంత విశ్వంలో మాకు తెలిసిన గ్రహాలు, జీవకోటి ఉన్నవి ఆరువందల ముప్పై. ఒక్కో గ్రహంలో జీవులు ఒక్కొక్క జీవధాతువు ఆధారంగా బతుకుతున్నారు. మనిషి సుఖంగా ఉండాలంటే 25 నుండి 30 సెల్షియస్ డిగ్రీల వరకూ ఉండాలి. అయినా మైనస్ ముప్పై సెల్షియస్ డిగ్రీలలో మనిషి బతుకుతున్నాడు. అలాగే 51 సెల్షియస్ డిగ్రీల వరకూ కూడా. మీ అజ్ఞానం వల్ల ప్రతి ప్రాణీ ఈ శీతోష్ణ స్థితి దాటితే చనిపోవడం ఖాయమనుకుంటారు. ఉదాహరణకు మా గ్రహంలో ప్లస్ ఆర్ మైనస్ 480 సెల్షియస్ డిగ్రీలవరకు భరించగలం. తర్వాత మాకు ఎముకల ఫ్రేము లేదు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం ఏమీ లేవు. ద్రవం ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర ఆకారం పొందినట్టు, మా ఆకారాలుకూడా మా ఇష్టం వచ్చినట్టు మారుతాయి. అందుకే మిమ్మలను చూస్తూ, నా ఆకారాన్ని మీలా మార్చుకున్నాను.

మది మహర్ గ్రహం. మీరు చెప్పిన ఆల్ఫా సెంటురీ, బెర్నార్డ్ నక్షత్రాల మధ్యదూరం మా దృష్టిలో సముద్రానికి, సముద్రపు ఒడ్డున ఉన్న గులకరాయికి ఉన్న దూరం. మీ ఊహ కందనంత దూరంలో ఉన్న మహర్ గ్రహంనుండి ఇక్కడకు రావడానికి మాకు ఆరు నిమిషాలు పడుతుంది. అదే మీ భూలోకవాసుల లెక్క ప్రకారం అది ఆరు ఏళ్ళు దాటవచ్చు... మాకాలమానానికి, మీ కాలమానానికి తేడా ఉంది. మనువుని జీవిత కాలం మాకు సంవత్సరంతో సమానం. ఆశ్చర్యపోతున్నావా? మనువుని ఆలోచనలకు చాలా తక్కువ అవకాశం ఉందని ముందే అన్నాను కదా! కాంతివేగానికి కొన్ని వందల రెట్లు వేగంగా ప్రయాణం చెయ్యవచ్చు..."

కాంతివేగంతో ప్రయాణం చెయ్యడం అసంభవం అని "థియరీ ఆఫ్ రెలిటివిటీ" ప్రదాత ఐన్‌స్టీన్ మొదలు ఎందరో చెప్పారు. ఎందుకంటే ఆ వేగంలో మనిషి శరీరం పొడి పొడి అయిపోతుంది. మరైతే ఈ పెద్ద మనిషి ఇలా అంటాడేమిటి! నో! కావడానికి వీల్లేదు.

"అసంభవం... కాంతివేగం చేరుకోవడమే కష్టం. కొన్ని వందలరెట్లు కూడానా?" కోపంగా అరిచాను.

"ఒక సెకనుకు లక్షాఎనభైఆరువేల మైళ్ళు, లేదా మూ డు లక్షల కిలోమీటర్ల దూరం మీ దృష్టిలో పెద్దదే కావచ్చు. మీ విజ్ఞానం ఇంకా అభివృద్ధి చెందలేదు. భూమిమీద పక్షి ఎగిరే ఎత్తు ఇరవైవేల అడుగులు. పక్షి దృష్టిలో అదే ఎక్కువ..."

"ఆ వేగంలో వెడితే నీ శరీరం అంతా పుప్పొడిలా మారాలే?"

"మీ శరీరం అయితే అంతే! మది ద్రవలక్షణాలున్న శరీరం అని చెప్పా కదా! పిండి అయ్యే అవకాశం లేదు. కాంతి వేగానికి కొన్ని వందల రెట్ల వేగంతో మీరు ప్రయాణించవచ్చు... మీ శరీరాలు మార్చుకొనగలిగితే...మీ శరీరంపై ప్రయోగాలు చేసుకుని, మాలా తయారుచేసుకోగలిగితే... అప్పుడు మీకుకూడా ప్లస్ ఆర్ మైనస్ 500 సెల్షియస్ డిగ్రీల వాతావరణాన్ని భరించే శక్తి వస్తుంది. చిన్న పరికరాల సాయంతో ప్లస్ ఆర్ మైనస్ 3,000 సెల్షియస్ డిగ్రీల వరకు భరించవచ్చు.

"దానికి మేమేం చెయ్యాలి..."

"మీ పరిశోధనలన్నీ మీ శరీరంమీద కేంద్రీకరించుకోవాలి. ఆక్సిజను లేకుండా మీరు జీవించగలగాలి. ఎన్నో అవయవాలతో "టిక్, టిక్" మని కొంతకాలం కొట్టుకుని ఆగిపోయే గడియారంలాగా కాక, యంత్రాల అవసరం లేని- అంటే గుండె, శ్వాసకోశం, జఠరాశయం అని ప్రత్యేకంగా లేని-శరీరం కావాలి."

"మీ మహర్ గ్రహవాసులకు మా భూవాసులంటే ఎందుకింత అభిమానం?" అంకుల్ అడిగాడు.

"మా నాగరికతకు అందినంతవరకు ఇంకా ఆరు వందల వరకు జీవరాసులున్న గ్రహాలున్నాయని చెప్పానుగదా! వాటిలో నాగరికత బాగా అభివృద్ధి చెందింది మామహర్. మిగిలినవి చాలా వెనుకబడి ఉన్నాయి వైజ్ఞానికంగా...భూమిలాగా ...కొన్ని గ్రహాలలో ఇంకా వారికి శరీరాంగాలే ఏర్పడలేదు. ఇంకా జీవపరిణామ దశలోనే ఉన్నాయి. మా అంతటి నాగరికత సంతరించుకున్న గ్రహవాసులు ఇంకా నాలుగు చోట్ల ఉన్నారు. వారిలో మూ డు గ్రహాలవారికి భూమిమీద ఆసక్తి లేదు. ఇంకొక గ్రహం "సుహ". ఆ గ్రహవాసులంతా భూమి నాశనాన్ని కోరేవాళ్ళే!

ద్రవ లక్షణాలున్న మేము మనుషులుగా పుట్టి, భూమికి మేలు చేయాలని చూస్తాం. వాళ్ళు మారణకాండ చెయ్యాలని చూస్తారు. ఒక ఏడాది ఇక్కడ మీ రూపంలో ఉండి చెయ్యవలసినదంతా చేసి, మీ లాగే చనిపోయినట్టు నటించి, విహారయాత్ర ముగించుకుని ఇంటికి వెళ్ళినట్టు వెళ్ళిపోతారు. ఇదివరలో ప్రతి రెండు మూ డు సంవత్సరాలకు ఒక బృందం చొప్పున ఈ భూమిమీదకు వచ్చే వాళ్ళం...మాకూ లు మనుషుల మేధస్సుకి మించి ఆలోచించే ప్రవక్తలు, మేధావులు మా

మహర్ గ్రహవాసులే... నియంతలు. క్రూరులు ఈ గ్రహాన్ని నాశనం చేయాలని. మనిషిని క్రూరంగా హింసించాలని చూసే దుర్మార్గ ప్రజలు 'సుహా' గ్రహవాసులు. ఈ ఆరు వందల ముప్పై గ్రహాలలో జరిగే నిత్యకృత్యం ఇదే... భూగ్రహంలో అయిదు వేల సంవత్సరాల కాలంలో మామనుమలు ఎన్నో అవతారాలు ఎత్తి ప్రజలకు మేలు చేశారు. ఈ సారి ఇంకొక ఆరు సంవత్సరాలలో మళ్ళీ మా 'మహర్' గ్రహవాసి ఇక్కడకు రాబోతున్నాడు. ఒక ఏడాది ఉండవచ్చు. ఇంకా తక్కువ సమయం తీసుకుని కాంతివేగానికి వందలరెట్ల వేగంతో ప్రయాణం చేసే సాధనాన్ని మీ కందించి తిరిగి "మహర్" వచ్చేస్తాడు. ఈగ ఒక మట్టిదిబ్బనుండి ఇంకొక మట్టి దిబ్బకు ఎగిరే ప్రయత్నంలా ఉన్నాయి ఇప్పుడు మీ అంతరిక్ష యానాలు. కొత్త శక్తి వచ్చాక మీరు ఇతర గ్రహవాసులను కళ్ళారా చూస్తారు. మీలో కొందరిని "మహర్"తీసుకు వస్తాడు.ఈ లోపల మీ శరీరాలపై పరిశోధనలు జరుపుకుని "మహర్" యాత్రకు మీరు సిద్ధం కావాలి..."

"అంటే 1990 లో "మహర్" గ్రహవాసి ఇక్కడకు వస్తాడన్న మాట..."

"అవును. ఇక్కడ పరిస్థితులు చూసి నేను 'మహర్' వెళ్ళి మా ప్రతినిధిని పంపాలి..."

"పన్నెండెకరాల స్థలంలో నాలుగు వందల ఏభై అడుగుల ఎత్తున కట్టిన పిరమిడ్స్‌ను నిర్మించింది మీరేనా? ప్రపంచంలో ఉన్న ఏడెనిమిది వేల భాషలు మీరు మాట్లాడగలరా? మీకు గుండె. కాలేయం. ఊపిరితిత్తులు లేవుకదా! మీ జీవశక్తి ఎలా వస్తుంది? మీ ఆహారం ఏమిటి? వ్యవసాయం చేస్తారా? కరువు, కాటకాలు, తుఫానులు "సుహా" గ్రహవాసులు మీకుకూడా సృష్టిస్తారా?"

నా బుర్రలో ఎన్నో ప్రశ్నలు... వాటిని అర్థం చేసుకున్నట్టు కొన్నిటికి సమాధానం చెప్పాడు "మహర్" వాసి.

"భావప్రకటనే భాష. ఉచ్చారణ మారుతుంది ప్రతీ భాషకు. మామనసులో భావాల ప్రకంపనాలను మీరు అర్థం చేసుకునే భాషలోకి మార్చే విధంగా మెదడులో ఏర్పాటు ఉంది. ఇది సాధ్యం. మాకు జీవశక్తి కాంతినుండి లభిస్తుంది. కాంతి శక్తిని జీవశక్తిగా మార్చుకునే శక్తి మాశరీరాలకుంది. అందువల్ల జఠరాశయం. విసర్జకావయవాలు మాకు లేవు. అలాగే గుండె. శ్వాసకోశంకూడా. మాకు కావలసినది కాంతి ఒక్కటే. టన్నులకొద్దీ పడే విశ్వధూళిని శుభ్రం చేసి స్వచ్ఛమైన కాంతి మా శరీరాలపై ప్రసరింపచేసుకోవడమే మా దినచర్య..."సుహా" గ్రహవాసులు మా పనులకు అడ్డు తగిలి మాకు ఇబ్బంది కలిగిస్తారు."


"మరి ఈ అంతరిక్ష నౌకను ఎలా తయారు చేస్తారు?"

"దీనిలో ఏమీ లేదు. భద్రపరచుకున్న మా శక్తితోనే మేం ఎన్ని కాంతి సంవత్సరాల దూరమైనా పోగలం."

×××× ××

తూర్పున వెలుగు రేఖలు పొడసూపుతున్నాయి.

"మహర్" నివాసితో ముచ్చటింపు ముగిసింది. అతడు తిరిగి వెళ్ళిపోతానన్నప్పుడు




నేను భయపడ్డాను. కాంతివేగాన్ని మించిన వేగంతో అతడు వెళ్ళితే. రాజస్థాన్ ఎడారి కంపిస్తుంది. సుడిగాలి విపరీతంగా లేచి ఆ గాలి వేగానికి మేమూ జీపుతో సహా ఒకటి రెండు మైళ్ళు గాలిలో లేచిపోతాం. నా అనుమానం గ్రహించిన వాడిలా అన్నాడు "మహర్" వాసి:

"మీ భౌతిక సూత్రాలు మాకు వర్తించవు. మీ పరిశోధనలు అన్నీ మీ శరీరాలమీద జరగాలి. కాంతిని జీవశక్తిగా మార్చే శక్తి కలగాలి. మీ ఆలోచన సరళి మారాలి."

"కాంతిని జీవశక్తిగా మార్చే అంటే... అప్పుడిక ఈ వ్యవసాయం. కోట్లకొద్దీ వెచ్చించి కట్టిన డాములు. కాలువలు. కొత్త పంగడాలు. గోదాములు. రవాణా ఇవన్నీ అవసరం లేదు. అంటే ఫార్ములా ప్రకారం మనిషిలోకూడా చెట్లులోలాగా కాంతి సాయంతో కిరణజన్య సంయోగక్రియ జరుగుతుందన్న మాట. అప్పుడు ఎవరి ఆహారం వారే శారీరకంగా తయారు చేసుకుంటారన్న మాట... అప్పుడసలు ఆకలి. ఆకలి చావులు- ఇవేవీ ఉండవు. వండ్రఫుల్.

'మహర్' మనిషి చిన్న శబ్దంతో మాయమయ్యాడు. కాంతివేగం కన్న ఎక్కువ వేగం ఉన్న అతని వేగాన్ని కన్ను చూడలేకపోయింది. జీపులో పక్కనే కూర్చుని ఆనందంతో పిచ్చివాడిలా కేక లేస్తున్నారు అంకుల్.

ఎడారిలో ఇప్పుడు మేమూ , మా జీపూ తప్ప ఇంకేమీ లేవు.

×××× ××

వచ్చిన దారినే వెనక్కు నడుపుకుంటూ వెళ్ళాం... హైవే కనిపించింది. హైవే దరిదాపుల్లో ఉందని వెలుతురులో గమనించి మామయ్య ఆనందంగా నవ్వాడట.

బార్మార్ చేరేటంతవరకు ఎవరి ఆలోచనలలో వాళ్ళున్నాము- మామయ్యా. నేనూ.

ఒక మట్టి దిబ్బమీదనుండి ఇంకో మట్టిదిబ్బకు ఎగిరే ప్రయత్నమా మన అంతరిక్ష యాత్రలు!

కాంతి వేగానికి కొన్ని వందల రెట్ల వేగం అంటే ఎలా ఉంటుంది?

ప్లస్ ఆర్ మైనస్ మూడువేల సెల్షియస్ డిగ్రీల వరకు భరించే శక్తి మనిషికి వస్తుందా?

మెకానికల్ వాచీలో తిరిగే లోహపు ముక్కల బదులు ఎలక్ట్రానిక్ ఇంపల్సుతో నడిచే ఎలక్ట్రానిక్ వాచీలోలాగా మనిషి. గుండె. శ్వాసకోశం. జఠరాశయం. మూత్రపిండాల అవసరం ఇక ఉండదా? 'మహర్' నివాసి మనిషి రూపంలో ఉంటూ ఇవన్నీ నేర్పుతాడా?

ఇన్నాళ్ళూ మనం భగవంతుడిగా పూజిస్తున్న అవతార పురుషులు మహర్‌వాసులా!

1990 లో మళ్ళీ ఇంకో అవతారం రాబోతోందా? అది పదకొండో అవతారమా? మరి పదో అవతారం? ఈ మాటలు మాత్రం పెద్దగా అన్నాను. మామయ్య జీపు ఆపి. నా వంక చిత్రంగా చూశాడు. ఏమిటి మాట్లాడుతున్నావన్నాడు. ఎగిరే పళ్ళెం అనుభవం గురించి అన్నాను. అదేమిటన్నాడు. కలగన్నావన్నాను. భ్రమేమో అన్నాడు. అయితే అదంతా కలనా! నాకది కల అనిపించడం లేదు. కల ఎలా అవుతుంది నేను ప్రత్యక్షంగా చూసినప్పుడు? నేను చూసింది చూసినట్లు చెప్పాక మామయ్య అన్నాడు. కలో. నిజమో గాని మామయ్య ఇలా అన్నాడు-

"ఫోటో సింథసిస్ (కిరణజన్య సంయోగ క్రియ) ఇన్ మేన్" అనే విషయంమీద పరిశోధిస్తాను. వ్యవసాయం అవసరం లేకుండా చేస్తాను. ఎందుకు ప్రయత్నించకూడదు?"

సాయంత్రం జైపూర్ రైలు ఎక్కాము.

రైలు కూత వేసింది... బయలుదేరింది.

వేగం పుంజుకుంది.

గంటకు వంద కిలోమీటర్లవేగంతో దూసుకుపోతోంది.

ఒక వైరస్ (అతి సూక్ష్మక్రిమి) గుండుసూది మొనలో ఉండే నీటిలో కదిలే వేగం అది... మహర్‌వాసి వేగంతో పోల్చి చూస్తే!

*